క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీమోహన్

సామర్లకోట: వాహన చోదకులతో పాటు పాద చారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించడానికి అవకాశం ఉంటుందని పెద్దాపురం డీఎస్పీ సుంకర మురళీమోహన్ అన్నారు. గురువారం స్థానిక పోలీసు రింగ్ సెంటర్‌లో ట్రాఫిక్ పరిస్థితిని గమనించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లతో మాట్లాడుతూ తప్పనిసరిగా యూనిఫారం ధరించాలని, ఆటోలో రికార్డు ఉండాలని అన్నారు. ప్రతీ ఆటోకు ఇన్సూరెన్సు ఉండాలని సూచించారు. సీఐ కె. దుర్గాప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, ఏఎస్సై టీవీ రత్నం పాల్గొన్నారు.

వాహనాలకు నంబరు బోర్డు తప్పనిసరి



నంబరు బోర్డులు లేని మోటార్ సైకిళ్లను పరిశీలిస్తున్న పోలీసులు

సామర్లకోట: రోడ్లపై తిరిగే వాహనాలకు తప్పనిసరిగా కనిపించే విధంగా నంబరు బోర్డులను ఏర్పాటు చేసుకోవాలని సీఐ కె. దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక అవుట్ పోస్టు పోలీసు స్టేషన్ వద్ద నంబరు బోర్డులు లేని మోటారు సైకిళ్లను గుర్తించారు. వాటికి నంబర్లు వేయించి హెచ్చరించి వదిలేశారు. కొత్త వాహనాలు కొనుగోలు చేసిన నెల రోజుల లోపుగా నంబరు వస్తుందని, నంబరు బోర్డు వేయించక పోతే అపరాధ రుసుం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, ఏఎస్సై టీవీ రత్నం పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



రోగులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మౌనిక

కొత్తపల్లి: వాకతిప్పలో సాలివాస రామాలయం వద్ద శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరిగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మౌనిక ఆధ్వర్యంలో 102 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓ వ్యక్తికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందన్నారు. ప్రతి ఒక్కరూ కోవిడ్ నిబంధనలు, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ పొలాని దొరబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మాస్టర్ వీవర్స్ లొల్ల వీరవెంకట సత్యనారాయణ ప్రారంభించారు.

అనుమానితుల ఫొటో విడుదల



బైక్‌పై వెళుతున్న చైన్ చోరీ అనుమానితుల సీసీ ఫుటేజ్ ఫొటో

పెద్దాపురం: సీసీ ఫుటేజ్ ద్వారా చైన్ దొంగల అనుమానితుల ఫొటోను పోలీసు విలేకరులకు శుక్రవారం విడుదల చేశారు. ఈ నెల 27వ తేదీన శోభా థియేటర్ వద్ద నడిచి వెళుతున్న ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన విషయంపై నిందితుల ఫొటోను సీఐ అబ్దుల్ నబీ విడుదల చేశారు. ఫొటోలో ఉన్న వారి ఆచూకీ తెలిసిన వారు 94409 04844, 94409 04846, 99088 84719 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

ఎస్పీని కలసిన ఎస్‌డీపీవో



ఎస్పీ సతీష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్‌డీపీవో

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా పెద్దాపురం సబ్ డివిజన్ పోలీస్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన లతాకుమారి శుక్రవారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను కాకినాడలోని పోలీస్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెద్దాపురం సబ్ డివిజన్‌లో శాంతి భద్రతలపై చర్చించారు.

మత్స్యకారుల సమస్యలపై పోరాటం

కొత్తపల్లి: మత్స్యకారుల సమస్యలపై జనసేన పోరాడుతుందని ఆ పార్టీ నాయకుడు పిల్లా శ్రీధర్ అన్నారు. శుక్రవారం కాకినాడలో పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ చేపట్టిన కార్యక్రమానికి ఇక్కడి నుంచి నాయకులు బైక్ ర్యాలీగా వెళ్లారు.

సామర్లకోట.. పూడిక మేట

- ప్రధాన డ్రైన్‌లో పెరిగిపోతున్న వ్యర్థాలు
- వర్షాలు వస్తే చెరువులుగా మారుతున్న రోడ్లు
- గాంధీచౌక్ వద్ద మూసుకుపోయిన కల్వర్టు

సామర్లకోట: పట్టణ పరిధిలోని ప్రధాన డ్రైనులో పూడిక పెరిగిపోవడం వలన వర్షాలు వచ్చిన సమయంలో రోడ్లు చెరువులుగా మారిపోతున్నాయి. వార్డుల్లోని డ్రైన్లలో మురుగునీరు పిల్ల కాలువ నుంచి ఏలేరు కాలువలోనికి వెళుతుంది. స్థానిక స్టేషన్ సెంటర్ నుంచి రైల్వే గేటు వరకు ఉన్న ప్రధాన డ్రైనులో పూడిక పెరిగిపోయింది. దీనికితోడు రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన డ్రైన్లను ఆక్రమించి షాపుల యజమానులు శ్లాబ్‌లు వేయడం వలన వర్షపు నీరు డ్రైనులోనికి పోయే మార్గం లేకపోవడంతో రోడ్లపై నిలిచిపోతోంది. దీనికితోడు వ్యర్థ పదార్థాలను, ప్లాస్టిక్ గ్లాసులను డ్రైనులలో వేయడం వలన నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడుతోంది. దాంతో వర్షం వచ్చిన సమయంలో జయలక్ష్మీ థియేటర్ రోడ్డు, స్టేషన్ సెంటర్, రథం సెంటర్ రోడ్లు చెరువులుగా మారిపోతున్నాయి. ఈ విషయాన్ని గమనించి కూడా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

మూసుకుపోయిన కల్వర్టు

స్థానిక స్టేషన్ సెంటర్ నుంచి ప్రధాన డ్రైనులోని మురుగునీరు గాంధీచౌక్ వద్ద ఉన్న కల్వర్టు మీదుగా పిల్ల కాలువ నుంచి ఏలేరు కాలువలోకి వెళుతోంది. అయితే గాంధీచౌక్ వద్ద ఉన్న కల్వర్టు దిగువ భాగంలో పూడిక పెరిగిపోవడంతో నీరుపోయే మార్గం లేక వర్షాలు వచ్చిన సమయంలో కల్వర్టు నుంచి మురుగునీరు రోడ్డుపైకి వస్తోంది. గాంధీచౌక్ నుంచి రైల్వే గేటు మీదుగా ఏలేరు కాలువ వరకు ఉన్న పిల్ల కాలువలోని పూడిక పూర్తిగా తొలగిస్తే ముంపు సమస్య ఉండదని స్థానికులు అంటున్నారు.



గాంధీచౌక్ వద్ద కల్వర్టు నుంచి పిల్ల కాలువలోకి వస్తున్న మురుగునీరు



గాంధీచౌక్ వద్ద కల్వర్టు మూసుకు పోవడంతో నీటి ప్రవాహానికి అంతరాయం

ప్రధాన డ్రైనుపై దృష్టి సారించాలి



పట్టణంలో మురుగునీరు పోయే విధంగా ఏలేరు కాలువ ఉండటం పట్టణ ప్రజల అదృష్టం. ఈ ఏలేరు డ్రైనులోనికి వెళ్లే ప్రధాన డ్రైనుపై అధికారులు ఎందుకు దృష్టి సారించడం లేదో తెలియదు. గాంధీచౌక్ వద్ద ఉన్న కల్వర్టు దిగువ భాగంలో పూడిక పెరిగిపోయింది. దాంతో అనేక ప్రాంతాల్లో రోడ్లు చెరువులుగా మారుతున్నాయి. కల్వర్టు దిగువ భాగంలో పూడికతీతపై దృష్టి పెట్టాలి.

– జి.రాజుమాస్టారు, మదర్ థెరిస్సా వలంటరీ ఆర్గనైజేషన్ అధినేత, సామర్లకోట

గాంధీచౌక్ కల్వర్టులో పూడిక తీయిస్తాం



గాంధీచౌక్ వద్ద ఉన్న కల్వర్టు వద్ద పూడిక తీతకు చర్యలు తీసుకొంటాం. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంగా రెండు రోజుల్లో పూడిక తొలగిస్తాం. తరుచూ డ్రైనులో ప్లాస్టిక్ గ్లాసులు వేస్తున్న బార్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేస్తాం.

– పి.శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టరు, సామర్లకోట

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం అవుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తెలిపారు. పట్టణంలోని అభివృద్ధి పనులకు సంబంధించి అజెండాలో పొందుపర్చిన అంశాలపై చర్చించడానికి అధికార, ప్రతిపక్ష సభ్యులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలన్నారు.

బంగారు, వెండి పుష్పాలతో మరిడమ్మకు పూజలు



పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అర్బన్ పరిధిలోనూ జగనన్న భూ రక్ష

మున్సిపల్ ఆర్‌డీ సత్యనారాయణ

పెద్దాపురం: పట్టణ ప్రాంతాల్లోనూ జగనన్న శాశ్వత భూ హక్కు పథకంపై డ్రోన్ సర్వేలు చేపడుతున్నామని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ (రాజమహేంద్రవరం) ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. పట్టణంలో చేపట్టే జగనన్న భూ హక్కు భూరక్ష డ్రోన్ సర్వేను శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్రలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీ సత్యనారాయణ మాట్లాడుతూ కోనసీమ జిల్లా అమలాపురం, రామచంద్రపురం కాకినాడ జిల్లాలోని పెద్దాపురం మున్సిపాల్టీలో ప్రారంభించామన్నారు. త్వరలో కాకినాడ నగరంలో భూ రీ సర్వే చేపడతామన్నారు. రీజనల్ పరిధిలో పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలులో రీ సర్వే పూర్తయిందన్నారు. త్వరలోనే భూ రీ సర్వే పూర్తి చేసి భూ హక్కు పట్టాలను తాడేపల్లిగూడెం మున్సిపాల్టీలో పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆర్డీ సత్యన్నారాయణ తెలిపారు. తొలుత మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్మన్, వైస్ చైర్మన్‌లు భూ రక్ష డ్రోన్ సర్వేను ప్రారంభించగా మహారాణి కళాశాల వద్ద చేపట్టిన డ్రోన్ సర్వేను ఆర్డీ పరిశీలించారు. టీపీఓ ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, విజ్జపు రాజశేఖర్, ఆరెళ్లి వీర్రాఘవులు పాల్గొన్నారు.



మహారాణి కళాశాల వద్ద డ్రోన్ సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీ సత్యనారాయణ

వేసవి శిబిరాన్ని వినియోగించుకోండి

పిఠాపురం: స్థానిక సహృదయ మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేసవి శిక్షణ తరగతుల గోడ పత్రికను శుక్రవారం ఎంఈఓ ఆర్‌వీ ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 22 ఏళ్లగా వేసవిలో పిల్లలకు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్న సహృదయ మిత్ర మండలిని ఆయన అభినందించారు. మే 1 నుంచి తరగతులు స్థానిక సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో ప్రారంభమవుతాయన్నారు. వచ్చే నెల 15తో ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. విశ్రాంత ఉద్యోగి అప్పారావు, సహృదయ మిత్ర మండలి సభ్యులు రమేష్, చిన్నారి సతీష్, పోతుల శ్రీనివాస్, పి.వేణు, పి.కామరాజు, జి.సరస్వతిరాజు తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ ఆర్‌వీ ప్రసాద్

రైతులకు అండగా ఆర్బీకేలు

పిఠాపురం: ఆయిల్‌పామ్ రైతులకు రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు) అండగా ఉంటున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖాధికారి పి.అరుణ్‌కుమార్ తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఆయిల్‌పామ్ పంటపై తెల్లదోమ దాడి, వాటి నివారణపై చర్యలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లదోమ నిర్మూలనకు పసుపు రంగు జిగురు అట్టలు చెట్లకు కట్టాలన్నారు. వేప నూనెను 3 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటితో కలిపి చెట్లకు పిచికారీ చేయాలన్నారు. యూరియా 0.5 గ్రాములు సర్ఫ్ డిటర్జంట్ కలిపి చెట్లకు పిచికారీ చేసుకోవాలన్నారు. వచ్చే తొలకరిలో ఆయిల్‌పామ్ రైతులు డ్రిప్ ఇరిగేషన్ తీసుకోవాలంటే స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో అధికారులను కలసి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది, ఆయిల్‌పామ్ రైతులు, పతంజలి ఫుడ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చేబ్రోలులో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రచార భేరీ పోస్టర్ ఆవిష్కరణ



ప్రచార భేరీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తపల్లి: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మోదీని గద్దె దించండి.. దేశాన్ని రక్షించండి అనే నినాదంతో నాగులాపల్లిలో ప్రచార భేరీ పోస్టర్‌ను జిల్లా రైతు సంఘ కార్యదర్శి జి.అప్పారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, సీఐటీయూ మండల కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, జి.శ్రీను, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

కొత్తపల్లి: ఓ యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామలింగేశ్వరరావు తెలిపారు. పొన్నాడ శివారు కోనపాపపేటకు యువతి 19న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బహిరంగ సభ స్థలం పరిశీలన

కొత్తపల్లి: మత్స్యకారుల సమస్యలపై ఉప్పాడ గ్రామంలో 8న నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, వనమాడి కొండబాబు కోరారు. ఉప్పాడలో ఆ సభా స్థలాన్ని శుక్రవారం వారు పరిశీలించారు.

ఏడుగురికి కారుణ్య నియామకాలు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ శాఖల్లో పని చేస్తూ వివిధ కారణాలతో మరణించిన కుటుంబీకులకు సంబంధించిన వ్యక్తులకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కృతికా శుక్లా కారుణ్య నియామకం కింద ఏడుగురికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఖాళీల సంఖ్య, రోస్టర్, సీనియారిటీ ప్రకారం అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇచ్చామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో జీఎస్ఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పల్లె.. స్వచ్ఛమల్లె

- ప్రగతి పథాన పంచాయతీలు
- ప్రజాప్రతినిధుల కృషికి అవార్డులు

కొత్తపల్లి: అందరూ కలిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతోంది.. అప్పుడే అన్నింటా విజయం వరిస్తోంది.. పల్లె.. స్వచ్ఛమల్లెలా తయారవుతోంది.. ఇలా ప్రగతి పథాన పరుగులు పెడుతున్న పంచాయతీలకు పురస్కారాలతో గుర్తింపు లభించింది. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపల్లి మండలం గోర్స, రమణక్కపేటలు జిల్లాలో ఉత్తమ పంచాయతీలుగా అవార్డులు పొందాయి. ప్రభుత్వం పేదరికం లేని గ్రామం, ఆరోగ్యవంతమైన, బాలహిత పంచాయతీ, నీటి సమృద్ధి, పరిశుభ్రమైన హరిత, స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాలు, సామాజికంగా సురక్షితమైన, సుపరిపాలన కలిగిన, లింగ సమానత్వంతో మరింతగా అభివృద్ధి అనే 9 అంశాలపై పంచాయతీలను ఉత్తమంగా ఎంపిక చేశారు. ఇందులో గోర్స పంచాయతీ పేదరికం లేని మెరుగైన జీవనోపాధి అంశంలో అవార్డు దక్కించుకుంది. రమణక్కపేట పంచాయతీ బాలహిత అంశంలో పురస్కారం పొందింది. ఈ పురస్కారాలను సోమవారం ఆయా పంచాయతీల సర్పంచులు రొంగల వీరబాబు, కాజులూరి అమ్మాజీ అందుకున్నారు. వీరిని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారి ఎస్‌వీ సత్యనారాయణ సత్కరించారు.



కలెక్టర్ కృతికా శుక్లా నుంచి అవార్డు అందుకుంటున్న సర్పంచ్ వీరబాబు

మరింత అభివృద్ధి చేస్తా..



పంచాయతీని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తా. పేదరికం లేని మెరుగైన జీవనోపాధి అంశంలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పిస్తున్నాం. 100 రోజుల పని దినాలే లక్ష్యంగా సాగుతున్నాం. మౌలిక సదుపాయాల్లో భాగంగా తాగునీరు, రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. పారిశుధ్యంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాం. అవార్డు రావడానికి సహకరించిన పాలకవర్గ సభ్యులు, అధికారులు, ప్రజలకు ధన్యవాదాలు.

–రొంగల వీరబాబు, సర్పంచ్, గోర్స

రాష్ట్ర పురస్కారమే లక్ష్యం



రమణక్కపేట జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావడం సంతోషంగా ఉంది. బాలహిత అంశంపై ఎంపిక కావడానికి సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యుల సహకారం ఎనలేనిది. వచ్చే ఏడాది జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నాటికి రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకోవడమే లక్ష్యంగా సౌకర్యాలు కల్పిస్తాం. ఉత్తమ అవార్డు రావడంతో తమపై మరింత బాధ్యత పెరిగింది.

–కాజులూరి అమ్మాజీ, సర్పంచ్, రమణక్కపేట

సమన్వయ కృషితో ప్రగతి

'దిశ' సమావేశంలో ఎంపీ గీత

కాకినాడ సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు పూర్తి స్థాయిలో ఫలితాలు వచ్చేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని కాకినాడ పార్లమెంటు సభ్యురాలు వంగా గీత కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో మాట్లాడారు. జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, కలెక్టర్ కృతికా శుక్లాతో కలిసి జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం), ప్రధానమంత్రి మాతృవందన యోజన, ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ), ఐసీడీఎస్ కొత్త ప్రాజెక్టులు, మిషన్ వాత్సల్య, దిశ వన్‌స్టాప్ సెంటర్, భూసార విశ్లేషణ ఫలితాల కార్డు (ఎస్‌హెచ్‌సీ), పరంపరాగత్ కృషి వికాస్ యోజన, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తదితరాల పురోగతిని సమీక్షించి మరింత మెరుగ్గా ఫలితాలు వచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ యువతకు ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమంపై మండలాల వారీగా అవగాహన కల్పించాలన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం 86 యూనిట్లు కాగా 135 యూనిట్లు ప్రారంభమైనట్లు తెలిపారు. 2022–23లో క్లస్టర్లలో 32,560 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వ్యవసాయాధికారులు వివరించగా జీవామృతం, కషాయాల తయారీ వంటి వాటిపై ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసుకుంటూ రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీ గీత సూచించారు. 385 గ్రామ పంచాయతీల్లో గ్రామీణ పేదలకు ఉపాధి కల్పన, ఉపాధి వేతనాలు సకాలంలో చెల్లింపులు, గ్రామీణ సుస్థిర ఆస్తుల కల్పన తదితర అంశాలను డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటలక్ష్మి వివరించారు. పునర్వ్యవస్థీకరణతో కాకినాడ జిల్లాలో 8 రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టులను, ఒక కార్పొరేషన్ ప్రాజెక్టును ఏర్పాటు చేసినట్లు ఐసీడీఎస్ పీడీ ప్రవీణ వివరించారు. జిల్లాలో 1927 మెయిన్, 59 మినీ మొత్తం 1986 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయన్నారు. 18 ఏళ్ల లోపు రక్షణ లేదా సంరక్షణ అవసరమైన పిల్లలకు స్పాన్సర్ షిప్ ద్వారా నెలకు రూ.4 వేలు అందించే కేంద్ర ప్రాయోజిత పథకం మిషన్ వాత్సల్య సజావుగా అమలయ్యేలా చూడాలన్నారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలను పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా వివరించారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గీత, చిత్రంలో జెడ్పీ చైర్మన్ వేణుగోపాల్, కలెక్టర్ కృతికా శుక్లా

ఒకటి నుంచి భగవద్గీత కంఠస్థ శిక్షణ

బోట్‌క్లబ్: విశ్వహిందూ పరిషత్ కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో బాల సంస్కార్ శిబిరం పేరుతో భగవద్గీత ఉచిత కంఠస్థ శిక్షణ తరగతులు, వ్యక్తిత్వ వికాస శిక్షణ మే 1 నుంచి 31 వరకూ ఉంటాయని పరిషత్ సభ్యులు గరిమెళ్ల అన్నపూర్ణయ్య శర్మ శుక్రవారం తెలిపారు. కాకినాడ గాంధీనగర్‌లోని అన్నపూర్ణ నిలయంలో ఈ శిక్షణ ఉంటుందన్నారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో పరిషత్ ఆధ్వర్యంలో జరిగే ప్రఖండ, జిల్లా స్థాయి భగవద్గీత కంఠస్థ పోటీలకు ప్రస్తుతం శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రతీ స్కూల్‌కి భగవద్గీత పుస్తకాలు అందజేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం విభూతి యోగం 10 అధ్యయనంపై పోటీలు ఉంటాయన్నారు.

తోలుబొమ్మలాట కులస్తులను బీసీల్లో చేర్చడంపై హర్షం

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం తోలుబొమ్మలాట కులస్తులను బీసీ బీ జాబితాలో చేర్చడంపై జయహో తోలుబొమ్మలాట సదస్సు హర్షం వ్యక్తం చేసింది. శుక్రవారం కాకినాడ కచేరిపేట సుందరయ్యభవన్‌లో నిర్వహించిన సదస్సులో కవి, రచయిత విశ్రాంతి తహసీల్దార్ గౌరీనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం తోలుబొమ్మలాట కులస్తులకు విడుదల చేసిన జీవో నంబర్ 8 ఆధారంగా కులధ్రువీకరణ పత్రాలు ఎలా తీసుకోవాలనే దానిపై సదస్సులో పాల్గొన్న సంఘ నాయకులకు వివరించారు. తోలు బొమ్మలాట వృత్తి కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు అనపర్తి ఏడుకొండలు మాట్లాడుతూ 2008 నుంచి అనేక పర్యాయాలు బీసీ కమిషన్‌కు తమ కులం గుర్తింపు కోసం విజ్ఞప్తి చేస్తూనే ఉన్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ బీ ధ్రువీకరణ పత్రాలు తీసుకునే విధంగా జీవో ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. సీపీఎం నాయకులు ఎం. రాజశేఖర్, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ సీహెచ్ అజయ్‌కుమార్, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు చైతన్యరెడ్డి, ఐద్వా సంఘం జిల్లా నాయకురాలు సీహెచ్ రమణి, ఎం.రమణమ్మ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో కాపీలను సంఘం నాయకులు, సభ్యులకు అందజేశారు.



బీసీ బీ జాబితాలో చేర్చిన జీవో కాపీలను ప్రదర్శిస్తున్న నాయకులు

రోజుకొక గంట లైబ్రరీకి

కరప: పాఠశాల స్థాయి నుంచి రోజుకొక గంట లైబ్రరీకి కేటాయించి, పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 1995–96 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు రూ.లక్షతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించి, విద్యార్థులతో మాట్లాడారు. పుస్తక పఠనంతో విజ్ఞానవంతులవ్వడమే కాకుండా నడవడిక కూడా మారుతుందన్నారు. విద్యార్థులు తమ పుట్టినరోజులకు, పాఠశాలకు అతిథులు వచ్చినప్పుడు అనవసర ఖర్చులు చేయకుండా ఆ డబ్బుతో మంచిపుస్తకాలు కొనుగోలుచేసి, లైబ్రరీకి డొనేట్ చేయాలని సూచించారు. టెన్త్‌కి వచ్చేసరికే జీవిత లక్ష్యాన్ని ఏర్పరచుకుని, దానిని సాధించేవరకు శ్రమించాలన్నారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలంటే అరకొర వసతులతో ఉండేవని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక నాడు–నేడు పథకంతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశారన్నారు. లైబ్రరీని ఏర్పాటుచేసిన పూర్వ విద్యార్థులు తుమ్మలపల్లి సత్తిబాబు, మండ రవి, తోట రామారావు, నెమ్మది సత్యనారాయణను ఎమ్మెల్యే అభినందించారు. ఎంపీడీఓ కర్రె స్వప్న, ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి, హెచ్‌ఎం యు.లీలామనోహర్, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

పాఠశాల నిధులు సక్రమంగా వినియోగించాలి

కరప: ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే నిధులను పేరెంట్స్ కమిటీ సభ్యులు, హెచ్‌ఎంలు నిబంధనల మేరకు తీర్మానాలు చేసి, పాఠశాలల ప్రగతికి వినియోగించాలని సోషల్ ఆడిట్ జిల్లా పరిశీలకులు, సీఎంఓ చామంతి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం పాఠశాలల్లో నిర్వహించే సామాజిక తనిఖీపై ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి అధ్యక్షతన జరిగిన ఒకరోజు శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. పాఠశాలల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, మౌలిక వసతుల కల్పన తదితర ఆరు అంశాల ప్రాతిపదికన నిధులు వినియోగించి, పాఠశాలలను అభివృద్ధి చేయాల్సి ఉంటుందన్నారు. నాలుగునెలలకొకసారి తనిఖీచేసి నివేదికలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు.



కరపలో సోషల్ ఆడిట్ నిర్వహణపై సూచనలిస్తున్న సీఎంఓ నాగేశ్వరరావు